# నేనెవర్ని?

కావిలిపాటి విజయలక్ష్మి

అవ్వాళ ఆదివారం. ఆఫీస్ సెలవు కనుక తీరిగ్గా ఇంట్లో కూర్చున్నాను పిల్లల అల్లరితో మధ్యాహ్నం నిద్రపట్టలేదు పేపరు తిరగేస్తున్నాను.

"ఏమండీ! పిలిచి ఆగింది మా ఆవిడ ఏమిటన్నట్లు పేపర్లోంచి ముఖమెత్తి ఆమెవైపు చూసాను"

"ఈ ఎమర్జన్సీ వచ్చాక చాలామంది రిటైరవుతున్నారని వింటున్నాం. పేపర్లో చూస్తున్నాం. మరి గబగబా కుర్రాళ్ళకి ఉద్యోగాలివ్వాలే అంది."

"అవును. అవుతాయి," అన్నాను పొడిగా. ఆవిడ చెప్పబోయేదానికి ఉపోద్ఘాతంగా ఈ సంభాషణ ప్రారంభించిందని నాకు తెలుసు. మా బావమరిది వారంరోజుల క్రితం, 'నా కేదన్నా ఉద్యోగం చూడండి బావా! చాలా ఇబ్బందిగా ఉంది ఇల్లు గడవటం' అని వ్రాసాడు. ప్రయత్నిస్తానని ఉత్తరం వ్రాస్తూ, ఓ ఏభైరూపాయలు మనియార్డరు చేశాను. కార్పొరేషన్‌లో ఏవో ఖాళీలు వచ్చాయట. ఓసారి పట్నంవెళ్ళి కనుక్కోండి అని మా ఆవిడ వేదించుకు తింటూంటే వెళ్ళి భోగిట్టాచేశాను. రెండు పోస్టులు ఖాళీలు ఉన్నాయి కాని షెడ్యూలు కులాలవారికి కేటాయించాం, అన్నారు.

కాళ్ళీడ్చుకుంటూ తిరిగివచ్చి మా ఆవిడ కావిషయం చెప్పాను.

"లంచమేమన్నా పెడితే ఇస్తారేమో! అంది."

"పాతరోజులు కాదు. ఇప్పుడు ఎమర్జన్సీ. చూస్తాతే మరోటేదన్నా." అని ఆమెకు నచ్చచెప్పాను. ఆవిడ కెంత సేపూ తమ్ముడికి ఉద్యోగమెలా అవుతుందనే ఆలోచనే. అతను బి.ఎ. పాసయ్యాడు. నాకే కాక తానెరుగున్న వాళ్ళందరికీ చెబుతూంటుంది, తన తమ్ముడి కేదన్నా ఉద్యోగం చూసి పెట్టండని. నిజమే, పుట్టింటివారు ఇబ్బందిపడుతున్నారంటే ఆమెకు బాధ కదూ!

"రైల్వేలో చాలామందికి అవుతున్నాయట,'' అందిమళ్ళీ.

"అహా, అన్నాను నాకు తెలియనట్లు.

"కనుక్కోండీ కాస్త,"అంది.నిష్ఠురం ధ్వనించిందా గొంతులో.

"లేబరు ఉద్యోగాలు జానీ. చెయ్యగలడా మీ తమ్ముడు! కష్టార్జితపడి చేరినా అతనేం పంపించగలడింటికి" అన్నాను.

ఆమె మాట్లాడలేదు. ఓ నిమిషం నిల్చుని, మరో గదిలోకి వెళ్ళిపోయింది.

మా పెద్ద అమ్మాయీ రెండో అబ్బాయీ దేనిగురించో తీవ్రంగా వాదించుకుంటున్నారు.

ఇహ తిట్టుకుంటారు. తర్వాత అమ్మాయి ఏడవటం ప్రారంభిస్తుంది. లాభంలేదు, అనుకుంటూ వాళ్ళున్న వీధి వరండాలోకి వెళ్ళాను.

నన్ను చూసి ఇద్దరూ గమ్మున మాట్లాడటం మానేశారు.

వీధిగేటు తెరచిన శబ్దం విన్పించి అటువైపుచూశాను.

ఎవరో సన్నగా, తెల్లగా, మాసిన బట్టల్లో యాచకుడిలా ఉన్న వ్యక్తి లోపలికి వస్తున్నాడు.

జేబు తడిమాను. పదిపైసలబిళ్ళ చేతికి దొరికింది.

నా ముఖంలోకి చూసిన అతను ఎందుకో గతుక్కుమన్నట్లయి కొంచెం అన్నం ఉంటే పెట్టిస్తారా సార్? అని అడిగాడు.

"ఎటూకాని వేళ ఇప్పుడు అన్నమెలా ఉంటుందోయ్? ఇదిగో తీసుకో. అంటూ పదిపైసలబిళ్ళ అతనివైపు విసిరాను.

అది తీసి కన్నులకద్దుకొని జేబులో వేసుకుంటూ, "చాలా ఆకలిగాఉంది సార్ కొద్దిగా అన్నం ఉంటే పెట్టించండి." మళ్ళీ అడిగాడు. నీరసంగా ధ్వనించిందతని గొంతు.

"చిట్టీ అన్నంఏమన్నా మిగిలిందేమో! అమ్మనడిగి ఉంటే పట్టుకురా!" అన్నాను మా పెద్దపిల్లవైపుచూస్తూ.

అన్నంలో పులుసుపోసి ఆకుతో తెచ్చింది చిట్టి.

"తిని వెళ్తావా? అడిగా నతన్ని."

"థాంక్స్ సార్. నా ప్రాణం నిల బెట్టారు." అని ఇంగ్లీషులో చెప్పి "కొంచెం నీళ్ళివ్వండి" అన్నాడు.

అతని ఉచ్చారణకు ఆశ్చర్యంగా అతనివైపు చూస్తూ, "ఒరె అబ్బాయ్, కొంచెం నీళ్ళు తేరా బకెట్‌తో. చిట్టీ ఆకు గుమ్మంలో ఉంచి లోపలికెళ్ళు." పిల్లలిద్దరి కేదేదో పని చెప్పాను.

మా అబ్బాయి తెచ్చిన నీళ్ళతో కాళ్ళూ చేతులూ, ముఖం కడుక్కొని, అన్నం ముందు కూర్చున్నాడు.

అతను ఆకలిగా ఆత్రతగా అన్నం తింటున్నాడు. తైలసంస్కారంలేని అతని క్రాపు పీచులా చిందరవందరగా రేగి ఉంది. మీసం గెడ్డం బలిసి ఉన్నాయి. అతని గురించి తెలుసుకోవాలి, అనే కుతూహలం కలిగిన నేను అతన్ని పరిశీలనగా చూడసాగాను. కోల ముఖం, ఎత్తయిన నాసిక, చిన్న కనులు, చెవులు, చేతులూ, మొత్తం మనిషిని చూస్తూంటె అతనెవరో నేను ఎరిగి ఉన్న వ్యక్తే అనిపిస్తూంది.

"నీదే ఊరు?" అడిగాను.

"భారతదేశం."

"అది చెప్పక్కర్లేదు. తెలుస్తూనే ఉంది. నీది ఏ ఊరని?" అన్నాను నవ్వుతూ.

"ఈ దేశంలోని ఊర్లన్నీ నావే," అన్నాడు.

మొండిగా అనిపించింది అతని జవాబు.



"భార్యాపిల్లలూ ఉన్నారా?", అడిగాను

అతను మాట్లాడకుండా గబగబా అన్నం తింటున్నాడు.

"నీ కెవరూ లేరా?" రెట్టించాను."


"ఒకప్పుడు ఉండేవారు. ఇప్పుడు నాకెవరూ లేరు," అంటూ ఆకు మడిచి పట్టుకొని గేటువైపు నడిచాడు,

అతను ఎవరు? ఎవరై ఉంటాడు!

అని తల పగలగొట్టుకుంటున్న నాకు వెనుదిరిగి నడుస్తున్న అతన్ని చూస్తుంటె చప్పున గుర్తువచ్చింది. నా క్లాస్‌మేట్ రామ్మూర్తి. వాడూ నేనూ విశాఖపట్నం ఎ.వి.ఎన్ కాలేజీలో బి.ఎ. కలిసి చదివాం. ఆ రామ్మూర్తి ఎందుకిలా తయారవుతాడు! మళ్ళీ సందేహం..

ఎంగిలి సుద్దిపెట్టి తలపంచి నిల్చుని చేతులు తుడుచుకుంటూ, "థాంక్స్, ప్రాణం పోకుండా ఈరోజుకి నిలబెట్టారు. వస్తాను సార్. అని వరండా మెట్లుదిగాడు.

సందేహంలేదు, రామ్మూర్తే, గడచిన ఈ పదిసంవత్సరాల్లో అతను చాలా మారాడు. మిసమిసలాడే అతని రంగూ వయసూ జారిపోయాయ్. ఎప్పుడూ మడత నలగని శుభ్రమైన బట్టల్లో ఉండే రామ్మూర్తి, మాసినబట్టలు కట్టాడు.



ఎప్పుడూ ఎవ్వరి ముందూ చెయ్యిచాచి యాచించని అతని ఆత్మాభిమానం చచ్చిపోయింది. కారణమేమై ఉంటుంది? మరి ఆలస్యం చెయ్యకుండా లేచి వరండా మెట్లుదిగి వెళిపోతూన్న రామ్మూర్తి చెయ్యిపట్టుకున్నాను. అతను తెల్లబోలేదు, ఆశ్చర్యపడలేదు, ముఖం చాటుచేసు కున్నాడు.

''నీ పేరు, నీ పేరేమిటి?'' అడిగాను అతని చెయ్యివదలకుండా.

''మీకు తెలిసిన ఎవరోవ్యక్తిని నేనని భ్రమిస్తున్నారులా ఉంది. అని అదోలా విరక్తిగా నవ్వి ''వదలండి చెయ్యి'' అన్నాడు.

"రామ్మూర్తి వికదూ?"అడిగాను.తడ బడింది నా గొంతు."

"ప్లీజ్, దయచేసి చెయ్యివదిలెయ్యరా మూర్తీ. నన్ను పోనీ" అన్నాడు. అతని గొంతు జీరబోయింది.

నా చెయ్యి అతని చేతిని గట్టిగా నొక్కిపట్టుకుంది.

నేనా యాచకుడి చెయ్యి పట్టుకోవటం వింతగా కనులు పెద్దవిచేసిచూసి, వాళ్ళమ్మకి వార్త చెప్పటంకోసం ఇంట్లోకి పరుగులాటి నడకతో వెళ్ళాడు అబ్బాయి.

"నన్ను వెళ్ళనియ్యరా!"... ప్రాధేయ పూర్వకంగా అడిగాడు రామ్మూర్తి నా చేతిలో బిగుసుకున్న చెయ్యి వెనక్కి లాక్కుంటూ.

"ఎందుకిలా తయారయ్యావ్? అసలు నీకేం జరిగింది? తెలుసుకోకుండా, నీకు నాచేతనయిన సహాయం చెయ్యకుండా విడిచిపెట్టను. రా, డాబామీది గదిలోకి పోదాం," అన్నాను అతని చెయ్యిపట్టి లాగుతూ.

మరి లాభంలేదనుకొన్నాడో ఏమో, నా వెంట డాబామీది గదిలోకి వచ్చాడు.

నేను మంచంమీద కూర్చుంటూ నా పక్క చోటుచూపించి కూర్చో అన్నాను.

తెల్లని దుప్పటి అతని మాసిన బట్టను తాకి కరాబవుతుందన్నట్లు "వద్దు ఇలా కూర్చుంటాలే." అని నా ఎదర చతికిలబడి కూర్చున్నాడు.

"ఏమిటి సంగతి? నాకంతా అయో మయంగా ఉంది, నీకు తల్లీ తండ్రీ, భార్యా పిల్లలూ అంతా ఉన్నారనుకుంటు న్నాను నేను. అదీకాక "నీకు కొద్దో గొప్పో ఆస్తికూడా. ఉండేదని గుర్తు. చాలాకాలం అయిపోయింది మనిద్దరం విడిపోయి. నువ్వేమీ ఉద్యోగ ప్రయత్నం చెయ్యలేదా? అడిగాను, ఆత్రతగా వాడి ముఖంలోని భావాలు పరిశీలనగా చూస్తూ.

తల్లీ, తండ్రీ ఉండేవారు, కాని పోయి నాలుగేళ్ళు చిల్లరయింది. భార్యా, ఇద్దరు పిల్లలూ ఉండేవారు. కాని వాళ్ళిప్పుడు ఎక్కడ ఉన్నదీ తెలియదు. ఆస్తులన్నీ కరిగిపోయాయ్. ఉద్యోగ ప్రయత్నం ఎందుకు చెయ్యలేదూ? అంటూ విరక్తిగా నవ్వాడు.

"ఫ్చ్, అయితేదొరకలేదా" అన్నాను.

మూర్తీ, ఈ ఎమర్జన్సీ ఏ పదేళ్ళ క్రితమో రావాలిసిందిరా. అలా అయితే ఈ సరికి దేశం రామరాజ్యమయిపోయేది. ఆంధ్రసమ్మె, రైల్వేసమ్మె జరిగేవికావు. నిరుద్యోగుల సంఖ్య పెరిగేదికాదు. లంచ గొండితనం ఈ సరికి నిర్మూలనమయి పోయేది...నాలాటి అభాగ్యుడు ఉండే వాడుకాడు," అన్నాడు.

నా పేరు నారాయణమూర్తి. వాడి పేరు శ్రీరామమూర్తి. కాలేజీలో నన్ను మూర్తీ అనీ, వాణ్ణి రామ్మూర్తీ అనీ పిల్చేవారు.

దేనికైనా టైము రావాలికదా! నీ సంగతి చెప్పావు కాదు అన్నాను.

"ఏముంది! ఉద్యోగం దొరికిందికాదు. ఎంత ప్రయత్నించినా. విసిగి వెళ్ళెత్తి పోయేవాణ్ణి. ఇల్లు గడవటం కష్ట మయ్యింది. మా ఆవిడ ఓ లాయరు గారింట్లో వంటకు కుదిరింది. నాకేమిటో ఆమె సంపాదన తింటూ ఇంట్లో పడి ఉండటం ఇష్టంలేకపోయింది. ఇంట్లో నిలవలేక ముళ్ళమీద ఉన్నట్లు గడిపాను ఓ నెలరోజులు ఎలానో. ఓ అర్ధరాత్రి ఇల్లు వదిలి దేశంమీద పడ్డాను. అన్నాడు అదోలా నవ్వుకుంటూ.

''నక్సలైట్లతో చేరావా?'' అడిగాను.

"లేదు, లేదు",కంగారుగాఅని,చిన్న చిన్న టెంపరరీ ఉద్యోగాలు చాలానే చేశాను. నాకే చాలని సంపాదన. భార్యా పిల్లలూ, క్రమంగా ఆ ఆలోచన విస్మ రించాను.దొరికితే ఏదన్నా పనిచెయ్యటం లేకపోతే ఇదిగో ఈ ఉద్యోగమే, అన్నాడు.

"ఫ్చ్, నాలుగురోజులు మా ఇంట్లో ఉండు. నీకేదన్నా వ్యాపకం చూస్తాను." అన్నాను.

"థాంక్స్," అని బరువుగానిట్టూర్చి, తన కృతజ్ఞతలు చెప్పాడు.

"మీ నేటివ్ ప్లేస్ చింతనిప్పుల అగ్ర హారం అనికదూ! అనేవాడివి!"అన్నాను,

"అవును," అన్నాడు వాడు.

"అక్కడ ఇల్లూ, భూములూ పెద్ద వ్యవసాయం ఉంది అనేవాడివి. మా అందరికన్నా చాలా దర్జాగా ఖర్చులు పెట్టేవాడివి. ఖరీదైన బట్టలు కట్టేవాడివి. ఫ్చ్ అలాంటివాడివి ...ఇలా..."అని సానుభూతి వ్యక్తపరిచాను.

అంతేరా బ్రదర్. ఆనాటి నా రూపం తల్చుకుంటే నాకే ఆశ్చర్యమనిపిస్తుంది. పరిస్థితులుమనిషినెంతగామార్చేస్తాయో" అని, అన్నాడు.

నిజమే అనిపించింది.

సాయంత్రం వేడినీళ్ళతో మా బాత్ రూంలో శుభ్రంగా స్నానంచేశాడు రామ్మూర్తి. నా ఇస్త్రీబట్టలు ఓ జత తొడుక్కోమని ఇచ్చాను. ఆ రాత్రి అత నికి ప్రత్యేకమైన డిన్నరిచ్చాను ఇంట్లో.

డాబామీద అరుబయట పక్కలు వేయించాను మా ఇద్దరికీ. కాలేజీలో

జరిగిన ఎన్నో సంఘటనలు చెప్పాను, గతం గుర్తు చేసుకుంటూ.

కొన్నిటికి ఊకొట్టాడు. కొన్ని మాటలు విని నవ్వాడు రామ్మూర్తి అంతే. అతనా విషయాలేమీ మాట్లాడ లేదు.

అర్ధరాత్రి తర్వాత నిద్రపట్టింది. ఉదయం ఎండ ముఖానికి తాకుతూంటె మెలకువ వచ్చింది నాకు. రామ్మూర్తి పక్కవైపు చూశాను, లేడు.

దిగువుకి వెళ్ళివుంటాడనుకొని డాబా మెట్లు దిగాను.

"నిన్న వచ్చినాయన నా ఫ్రెండు ఉన్నాడా?" అడిగాను చిట్టిని. నిన్న సాయంత్రం నా భార్యా పిల్లలకూ, మా ఇద్దరి మధ్యా ఉన్న స్నేహం క్లుప్తంగా చెప్పాను.

"ఆ, ముఖం కడిగి కాఫీ టిఫినూ తీసుకొని మళ్ళీవస్తాననిఎటో వెళ్ళారు," అని చెప్పింది చిట్టి.

"ఏమిటండీ దొంగాడిలా ఆలా ఇల్లంతా కలయచూసేడు మీ ఫ్రెండూ! అని అడిగింది మా శ్రీమతి కాఫీ ఇస్తూ.

"ప్చ్, పాపం, వాడు చాలా మంచివాడు, కానీ నీతో ఏమన్నా చెప్పాడా:" అడిగాను.


మళ్ళీ కలుస్తానని మూర్తికి చెప్పండి అని వెళ్ళిపోయాడు అంది శ్రీమతి.

ఆ రోజు, మరి నాలుగురోజులు, రామ్మూర్తి వస్తాడని చూశాను, కాని రాలేదు.

ఓనాటి రాత్రి మా ఇంట్లో దొంగలు పడి వంట ఇంట్లోని స్టీలు సామాన్లన్నీ దోచుకుపోయారు.

పోలీస్ రిపోర్టిచ్చాను కాని లాభం లేకపోయింది.

"ఫ్రెండని, ఆతనెవర్నో ఇల్లు చొరబెట్టారు. ఎప్పుడూ లేనిది దొంగలు



పడ్డారు," అని నామీద విసుక్కుంది శ్రీమతి.

ఆయితే వాడు చేయించాడంటావా. ఈ పని. తప్పు, అలా నోరు జారకు. వాడు చాలా మంచివాడు. ఏమీ చేతకాని వాడు. కనుకే యాచకుడయ్యాడు. అభ్యాగతి. స్వయంవిష్ణు - అన్నారు. ఎటూ కానివేళ వాణ్ణి ఆదరించి అన్నం పెట్టాం. ఆ పుణ్యం ఈ అనుమానంతో తుడుకుచుపోయింది," అని రామ్మూర్తి మీద నాకున్న అభిమానంతో మా ఆవిడని చివాట్లేశాను.

రామ్మూర్తి నా కెన్నివిధాల సాయం చేశాడు ! ఇంటిదగ్గరనుంచి డబ్బు రావటం ఆలస్యమైతే, ఎన్నిసార్లు డబ్బు సర్దుబాటుచేశాడు. వారంరోజులు వళ్ళు తెలియని జ్వరంతో రూమ్‌లో పడిఉంటే నా కెంత సేవచేశాడు ! గతం తలుచుకున్నకొద్దీ మా ఆవిడమీద కోపం వచ్చేది.

* * *

నెలరోజులు గడిచాయి. రామ్మూర్తి జాడలేదు, నాలుగువందల రూపాయలు బేంకినుంచి విత్‌డ్రాచేసి అవసరమైన పాత్రసామగ్రి కొనుక్కున్నాం.

నాలుగురోజుల క్యాంపు తర్వాత ఇంటికి వచ్చాను. నా శ్రీమతి కాఫీ గ్లాసుతోపాటు నా ముందో కవరుంచి "చదవండి, నామీదవిసిగిపోయారుగా ! మీ సంగతి తెలిసే అలా అనుమానపడ్డాను," అని దెప్పుతూనే పకపకా నవ్వి పక్కరూమ్‌లోకి వెళ్లిపోయింది.

కాఫీ తీసుకోకుండానే కవరు తెరిచాను.

"మూర్తీ...నేను గుర్తున్నానానీకు. నీ డియరెస్టు ఫ్రెండు శ్రీరామమూర్తిని. చింతనిప్పుల అగ్రహారపు నివాసిని. ఒరే బ్రదర్, ఓ శుభవార్త. మళ్ళీ నువ్వూ, నేనూ కలసి కొంతకాలం గడపబోతున్నాం. నాకు మీ ఊరు ట్రాన్స్‌ఫరయ్యింది. నువ్వు ఆ ఊళ్లో ఉన్నావని తెలుసు కాని, అడ్రసు తెలియదు. సూర్యంగాడు తెలుసుగా ! వాడు ఆ మధ్య హైదరాబాదు వెళ్తూ ట్రెయినులో నిన్ను కలిశాడుట. వాడు నీ అడ్రసు సేకరించాడట. వాడిచ్చాడు నీ అడ్రసు. ఎనిమిదవ తేదీ ఉదయానికల్లా, మీ ఇంటికి వచ్చేస్తున్నాను, నాకో ఇల్లు చూడు నీ ఇంటికి దగ్గరలో. నాకు ఇల్లు దొరికేదాకా మీ ఇంట్లోనే నా మకాం. మరి ఉంటాను. అన్నీ ముఖస్థంగా మాట్లాడుకుందాం. చాలాకాలం తర్వాత నిన్ను చూస్తున్నందుకు నాకెంతో సంతోషంగా ఉంది.

మరి నీకో ... నీ ప్రియమిత్రుడు శ్రీరామమూర్తి."

స్థాణువునైపోయాను. ఎంత మోస పోయాను! రాస్కెల్ ఎంత నాటక మాడాడు!...కాఫీ గ్లాసు చేతిలోకి తీసు కుంటూంటే మా ఆవిడ గదిలోకి వచ్చి నా ఎదర కుర్చీలో కూర్చుంది. తర్వాత పవిటకొంగు నోటికి అడ్డంపెట్టుకు కళ్ళ నీళ్ళ పర్యంతం నవ్వుతూ అవ్వాళ తిరుపతిలోనూ ఇలానే. ఏమిటండీ! ఇది" అంది.

నా తొందరపాటుకి సిగ్గు, దానితో పాటు నవ్వూ వస్తూంది. ఒక్కోసారి ఎంత ఫూల్‌నయిపోతున్నాను! ఈ సారి నిజంగా తెలిసిన వ్యక్తయినా పలకరించకూడదు, అనే నిర్ణయానికి వచ్చాను.

తిరుపతిలో జరిగిన సంగతి చెప్పక పోతే కథ సస్పెన్సులో ఉండిపోతుంది.

తిరుపతిలో కాఫీ, టిఫిన్లకోసం ఓ హోటల్లో దూరాం. నేనూ నా శ్రీమతీ, పిల్లలూ వరుస కుర్చీల్లో కూర్చున్నాం.

నా ఎదురుగా కూర్చున్న వ్యక్తి నాకు చిన్నప్పుడు చదువు చెప్పిన ఎలిమెంటరీ స్కూలు మేష్టరు. వెంకటేశ్వర్లులా కనిపించాడు. అవునా కాదా! అని రెండు నిమిషాలు పరిశీలనగా చూసిన మీదట అతనే అని నమ్మకం కుదిరింది.

"మేష్టారూ! నమస్కారం" అన్నాను వినయంగా. అతను ప్రతి నమస్కారం చేస్తూ, "బాబూ యాత్రకి వచ్చావా? భార్యా పిల్లలతో వచ్చావా?" అని అడిగాడు.

అవునని నా భార్యనీ, పిల్లల్నీ పరిచయం చేశాను. అందరి నమస్కారాలూ సంతోషంగా అందుకొని నా ఉద్యోగం, జీతం ప్రశ్నించాడు. చెప్పాను.

అతను వారిస్తున్నా వినకుండా రెండు రూపాయల పదణాలు, అతని బిల్లు నేనే చెల్లించాను.

ఇవతలికి వచ్చాక, "మేష్టారూ, మీ అబ్బాయి నరసింహంఏంచేస్తున్నాడూ?" అని అడిగాను.

"నాకు పిల్లలు లేరు నాయనా!" ఆ భగవంతు డివ్వలేదు. మరి వస్తాను అని ముందుకి నడిచాడు.

"ఎవరండీ, అతనూ?" అడిగింది నా శ్రీమతి.

"వెంకటేశ్వర్లు మేష్టారనుకున్నాను. కాదులా ఉంది. అతను పొడగరి. ఇతను పొట్టి" అన్నాను, హోటలు బిల్లు నిష్కారణంగా చెల్లించినందుకు నన్ను నేను తిట్టుకుంటూ.

మా ఆవిడ నవ్వుతూంటే నాకు ఉడుకుమోత్తన మొచ్చింది. కాని నాకూ నవ్వొచ్చింది. నా నేమ్ బోర్డు చూసి ఉంటాడు. దొంగవెధవ! మూర్తీ అనేశాడు.

తర్వాత "జానీ, నేనుత్త ఫూల్‌ని సుమా! అచ్చం రామ్మూర్తిలా కనిపించాడా దొంగవెధవ. నేను నీ స్నేహితుణ్ణి కాను. అని చెప్పకుండా అతిథి సత్కారాలందుకుని ఇల్లు నలుమూలలా పరికించి కన్నంవేశాడు" అన్నాను.

"మనిషినిపోలిన మనిషి ఉండొచ్చు. కాని అదేమిటండీ మీరు! ఏ ఇరవై సంవత్సరాలక్రితమో ఎరిగున్న వ్యక్తితో పోలికకట్టి ఫలానా ఆయన మీరా! అని పరికరించేస్తే నవ్వరూ!" అంది నవ్వుతూనే.

నాకెలాగన్నా తొందరపాటు జాస్తి. ఓసారి పండక్కి అత్తవారి ఊరు వెళ్ళాము. మా వదినగారు, తోడల్లుడూ కూడా వచ్చారు. కూతుళ్ళిద్దరికీ ఒకే రకం చీరలు కొన్నారు మావగారు. మా ఆవిడ అనుకొని వెనుకపాటుగా నిల్చున్న మా వదినగారి భుజంమీద చెయ్యేసి మెత్తగా చీవాట్లు తిని, క్షమాపణ చెప్పకున్నాను.

పాపం అమాయకుడు అంటారు మా మామగారు నన్ను.

అలా గతం, వర్తమానం, కలగా పులగంగా, మననం చేసుకుంటూన్న నాకు అవ్వాళ అభ్యాగతిని ఎక్కడ చూశానో గుర్తువచ్చింది చప్పున.

చాలా కాలంక్రితం నాతో బస్‌లో ప్రయాణం చేశాడు. ఇద్దరం కాస్సేపు మాట్లాడుకున్నాం. అప్పుడు శుభ్రమైన బట్టల్లో ఉన్నాడు. ఎంతో సంస్కారిలా మాట్లాడాడు.

అతను దిగిన కాస్సేపటికి పర్సు పోయిందని బస్సులో కలకలం ప్రారంభమయ్యింది. మా అందర్నీ చెక్ చేశారు.

వాడు నన్ను గుర్తుపట్టి గతుక్కు మన్నాడు. కాని నేనే వాణ్ణి మరచి రామ్మూర్తి పోలికలు వాడిలో వెతికి ఫూల్‌ని అయ్యాను.

వాడే పర్సు కొట్టేసి ఉంటాడని చాలామంది అనుకున్నారు. ఎందుకంటే పర్సుపోయిన దురదృష్టవంతుడు, అతని పక్కనే నిల్చున్నాడు.

* * *

వ్రాసిన ప్రకారం ఎనిమిదవ తేదీ ఉదయం రామ్మూర్తి వచ్చాడు. వయస్సు అనుభవం ఇచ్చిన నిండుదనంతో హుందాగా ఉన్నాడు. ఒకరి నొకరం కౌగలించుకున్నాం.

"అబ్బ! ఎంత మంచి స్నేహమండీ మీది." అంటూ, భోజనాల దగ్గర దొంగ రామ్మూర్తి విషయం చెప్పింది, మా ఆవిడ.

నా భుజంతట్టి నవ్వుతూ, అవునండీ మా వాడు, మా రూమే గుర్తుపట్టలేక విశాఖలో చాలాసార్లు తప్పిపోయేవాడు. ఆ వీధిలోనే అటునుంచి ఇటూ ఇటు నుంచి అటూ తిరిగి ఎవ్వరి తలుపో తట్టి,

వారిచేత చివాట్లు తిని చివరకు, కాలేజికి పోయేవాడు", అన్నాడు రామ్మూర్తి నవ్వుతూ.

"మరీ జోక్ చెయ్యకురా బ్రదర్. రూమ్ గుర్తుపట్టలేకపోయేవాణ్ణికొన్నాళ్లు. నిజమే కాని తర్వాత ఎప్పుడూ తప్పిపోలేదు. అంతా మొదటి సంవత్సరమే. అయినా, రాజావారి దివాణంలా, ఎన్నో గదుల ఇల్లు అది" అని నవ్వేశాను నేను.

"ఏమండోయ్, నేను నిజంగా వీడి ఫ్రెండ్‌నే. ఖంగారుపడకండి." అని తను పనిచేస్తూన్న ఆఫీసు పేరు చెప్పి నవ్వాడు రామ్మూర్తి.

* * *

మా పక్క వీధిలో రామ్మూర్తికి ఇల్లు దొరికింది. భార్యా పిల్లల్ని బయలుదేరి రమ్మనీ తాను స్టేషన్లో రిసీవ్ చేసుకుంటాననీ ఉత్తరం వ్రాశాడు రామ్మూర్తి.

కాని పాపం, భార్యా పిల్లలూ వచ్చే రోజు చలిజ్వరంతో మంచంమీంచి కదలలేక నన్ను వెళ్ళి తీసుకు రమ్మన్నాడు.

వాడి భార్యని నేనెప్పుడూ చూడలేదు, ఎలా ! అదే సంకోచం తెలియజేశాను వాడికి. ఆమె ఫోటో చూపించాడు. లేకపోతే ఫోటో తీసుకెళ్ళమన్నాడు.

ఫోటో రెండు నిమిషాలు చూశాను. బాగా గుర్తుపట్టడానికి ఇంకా చూడాలనుకున్నాను. కాని వాడేమనుకుంటాడో అని ఫోటో వాడికి ఇచ్చేసాను.

చామనఛాయ, పొట్టిగా బొద్దుగా ఉంటుంది. వెనుక ముగ్గురు పిల్లలుంటారు. చంటిది ఎనిమిది నెలలది, అని చెప్పాడు.

తీసుకువస్తాను, అని ఇంటికి వచ్చి మాఆవిడ కీవిషయం చెబితే "బాగుంది, మీరెవర్ని తీసుకువచ్చేస్తారో" అని నవ్విందామె.

"ఎవరో నా వెనుక ఎందుకు వస్తారు ? వాడి అడ్రసూ, పేరూ, వాడు వ్రాసిన ఉత్తరం తీసుకువెళ్తున్నాను", అని మా ఆవిడమీద చిరాకు పడ్డాను.

నేను ప్లాట్‌ఫారంమీదికి వచ్చేసరికి రామ్మూర్తి భార్యా పిల్లలూ వస్తూన్న ట్రెయిను వచ్చి శబ్దంచేస్తూ ఆగింది. రిజర్వేషను కంపార్టుమెంటులోంచి రామ్మూర్తి చెప్పిన పోలికలున్న ఆమె, సామాన్లు, పిల్లలతో దిగటానికి అవస్థ పడుతూంది. వెళ్ళి ఆమె చంకనున్న పిల్లని అందుకొని ఆమె చేతిలో ఉన్న తోలుపెట్టె అందుకొని ప్లాట్‌ఫారంమీద పెడ్తూ పిల్లని సరిగ్గా చంకన పెట్టుకొని "ఇంకేమన్నా సామాన్లున్నాయా ?" అన్నాను.

ట్రయిను ఐదునిమిషాలకన్నా ఆగదు. ఆమె ఇంకో రెండు పెట్టెలూ, హోల్డాలూ, రెండు బేగ్‌లూ, ఒక సజ్జా, ట్రెయినులోంచి అందిస్తే ఓ చేత్తోనే అందుకొని దిగువున పెట్టాను.

ఆమె, ఆమె వెనుక ఓ ముసలామె, ఇద్దరు పిల్లలూ దిగారు. రామ్మూర్తి భార్యా, ముగ్గురు పిల్లలే అన్నాడు. ముసలామె? ... అనే ప్రశ్న వచ్చినా, తల్లిని సాయంగా తెచ్చుకొని ఉంటుంది అని సరిపెట్టుకున్నాను.

''హమ్మయ్య ! నమస్కారమండీ ! మీరే సాయంచెయ్యకపోతే ట్రెయిను దిగలేకపోయేవారం", అని కృతజ్ఞతలు చెప్పి నా చేతిలో పిల్లకోసం చెయ్యి చాచింది.

నా చంకలో ఉన్నది అమ్మాయి కాదు, అబ్బాయి. రామ్మూర్తి అమ్మాయని చెప్పినట్లున్నాడే. ఏమిటో నాకంతా అయోమయంగా ఉంది.

"కూలీని మాట్లాడి పెట్టండిబాబూ !" అంటూంది ముసలమ్మ.

''రామ్మూర్తికి జ్వరంగా ఉంది. స్టేషనుకి రాలేకపోయాడు. నా పేరు మూర్తి. వాడి ఫ్రెండ్‌ని. మీకు చెప్పే ఉంటాడు" ... అని ఆమె ముఖంలోకి చూశాను.

"సారీ...రామ్మూర్తిగారెవరోమాకు తెలీదండి. మేము ఫలానా వారింటికి వెళ్తున్నాం'' అందామె.

మరి నిలవకుండా ప్లాట్‌ఫారంమీద రామ్మూర్తి భార్యకోసం అన్వేషణ ప్రారంభించాను.

పాపం రామ్మూర్తి భార్య, వాడికోసం నలుమూలలా దృష్టిసారిస్తూ కళ్ల నీళ్ల వత్తుకుంటూంది.

రామ్మూర్తి అడ్రసు, రామ్మూర్తి ఉత్తరం ఆమెకు చూపించి, నన్ను పరిచయం చేసుకున్నాను.

ఆమెకు ప్రాణం లేచివచ్చింది. ఆమెను తీసుకువచ్చి రామ్మూర్తి ఇంట్లో దించి ఆ పూట మా ఇంట ఆతిధ్యానికి ఆహ్వానించి ఇంటికి వచ్చాను.

కాని స్టేషన్లో... జరిగిన విషయం మాత్రం ఇప్పటివరకూ ఎవ్వరికీ చెప్పలేదు.

మా ఆవిడ నన్ను మతిమరుపు మనిషంటుంది. మా మామగారు అమాయకుడంటారు. నా మిత్రులు, మంచివాడంటారు. నేనంటే గిట్టనివాళ్ళు ఉత్త ఫూల్ అంటారు. ఇంతకీ నేనెవర్ని ?